క్లుప్తంగా

58వ వార్డులో నేడు 'జగనన్న సురక్ష'

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ సచివాలయ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తారు. కార్పొరేటర్ గులిగిందల లావణ్యతో పాటు ములగాడ తహసీల్దార్ వీరభద్రరావు తదితర అధికారులు హాజరు కానున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 18మందికి జరిమానా

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వాహనచోదకులకు కోర్టు భారీ జరిమానాలు విధించిందని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. 18 మందికి రూ.1.31లక్షలు జరిమానా వేసిందని తెలియజేశారు. వివరాలివి.. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందిపై కేసులు నమోదు చేశారు. వీరికి మంగళవారం 3వ స్పెషల్ మెజిస్ట్రేట్, ఇన్‌చార్జి 5వ స్పెషల్ మెజిస్ట్రేట్ వై.గణపతిరావు జరిమానాలు విధించారు. తాగి కారు నడిపిన వ్యక్తికి రూ.10వేలు, లారీ నడిపిన వ్యక్తికి రూ.10వేలు జరిమానా వేశారు. మోటార్ వెహికల్ యాక్ట్‌కు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారికి కూడా జరిమానాలు విధించారని పేర్కొన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 6.98 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. ఈ లెక్కింపులో రూ.6 లక్షల 98 వేల 185 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ఈవో సురేష్‌బాబా, వేంకటేశ్వర సేవా సంఘం నుంచి డి. నగేష్, అప్పారావు ఆధ్వర్యంలో పలువురు సేవకులు, దేవస్థానం ప్రధాన అర్చకుడు పి. నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కూర్మన్నపాలెం: పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తిరుమల నగర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో 87వ వార్డు తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో మంగళవారం పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో మొక్కలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. భావితరాలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. తిరుమలనగర్ అసో సియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, భాస్కరరావు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్, జీవీఎంసీ జోన్–5 అధికారులు, సచివాలయం, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాహన చోదకులు, వ్యాపారుల్లో ఇసుమంత మార్పు కూడా రావటంలేదు. ప్రధాన, అంతర్గత రహదారులపై భారీ లారీలు, ట్రావెల్ సంస్థలకు చెందిన బస్సులను పార్క్ చేస్తుండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

- అనధికార పార్కింగ్‌తో అవస్థలు
- చీకటి పడితే మరిన్ని ఇబ్బందులు
- ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిపై పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్



నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్



జ్ఞానాపురం వెళ్లే దారిలో వాహనాలు

కంచరపాలెం: తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం.. కంచరపాలెం నుంచి నేతాజీ ఫ్లైఓవర్ వంతెన.. జ్ఞానాపురం వెళ్లే రహదారుల్లో ఇష్టమొచ్చినట్లు వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపై రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి చాలా మంది డ్రైవర్లు వాటికి మరమ్మతులు చేసుకోవటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే ఈ దారుల్లో నెలల తరబడి వాహనాలు నిలిపి ఉంచటం వల్ల చెత్త, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. వాహనాలు అడ్డుగా నిలిపి ఉంచడం వల్ల పారిశుధ్య సిబ్బంది విధులకు ఆటంకంగా మారడంతో ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి అపారిశుధ్యం పేరుకుపోతోంది. అలాగే ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని చిరువ్యాపారులు లావాదేవీలు సాగించడం వల్ల కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

రహదారికి ఇరువైపులా..

కంచరపాలెం నుంచి ఎన్‌ఏడీ కొత్తరోడ్డుకు వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిపై వాహనాలు నిలిపేస్తున్న కారణంగా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డుల వద్దే పార్కింగ్..

జీవీఎంసీ జోన్–5 టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా వసూలు చేస్తామని అందులో రాశారు. కొందరు ఆయా హెచ్చరికలను నిర్లక్ష్యం చేయటమే కాకుండా.. ఆ బోర్డుల వద్దే ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. నిత్యం నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. కంచరపాలెం కూడలి గ్రామాభ్యుదయ సంఘం వ్యాపార భవనం వద్ద పార్కింగ్ మరీ దారుణంగా ఉంటుంది. హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించడంలో ట్రాఫిక్ పోలీసులకు ఉన్న శ్రద్ధ రహదారిపై ఆక్రమణలను తొలగించడంలో లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బీఆర్‌టీఎస్‌లో అనధికార పార్కింగ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంచరపాలెం వెళ్లే దారిలో వాహనాలకు మరమ్మతులు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ బీఆర్‌టీఎస్ రహదారిలో అనధికారికంగా పార్క్ చేసిన వాహనాలు

ప్రయాణం నరకం..

కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా ప్రయాణించాలంటే నరకం చూడాల్సి వస్తోంది. నిత్యం భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా నిలపడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

–కొరివాడ పైడిరాజు, దుర్గానగర్, కంచరపాలెం.

వాహనాలు తరలించాలి..

రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపి ఉంచిన వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణం చేసే వారికి ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి రహదారిపై నిలిచిపోయిన వాహనాలను తరలించాలి.

–పి.సునీల్‌కుమార్, జ్ఞానాపురం.

కుండపోత

- రహదారులు జలమయం
- లక్ష్మీనగర్‌లో కూలిన ఇల్లు



లక్ష్మీనగర్‌లో వర్షాల వల్ల కూలిన రేకుల ఇల్లు

గోపాలపట్నం: కుండపోత వానతో నగరం తడిసి ముద్దయింది. రెండు రోజులు సాయంత్రం సమయాల్లో కురిసిన వాన, మంగళవారం మాత్రం ఉదయం నుంచే దంచి కొట్టింది. మధ్య మధ్య కాస్త విరామం ఇస్తూ కురవడంతో, ప్రజలు రోడ్డు పైకి వచ్చి పనులు చక్కబెట్టుకుంటున్నారు. గాలి, ఉరుములు లేకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. వర్షంతో కాల్వలు, గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి. రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

కూలిన రేకుల ఇల్లు

వర్షాలకు జీవీఎంసీ 92వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో రేకుల ఇల్లు కూలిపోయింది. అయితే ఆ ఇంట్లో ఎవరూ నివాసం ఉండకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాలివి.. స్థానికుడు జి.అప్పారావు కుటుంబ సభ్యులతో కలిసి చాలా ఏళ్లు ఆ ఇంట్లో నివాసమున్నారు. రెండేళ్ల క్రితం కొండచరియలు విరిగిపడడంతో కొంతమేర గోడలు, రేకులు పాడయ్యాయి. ఆ తరువాత ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నించినా.. ఇల్లు దేవస్థానం స్థలంలో ఉండటంతో సింహాచలం దేవస్థానం అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఇక్కడికి కొద్ది దూరంలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఇప్పుడు వర్షాలకు గోడలు నానిపోవడంతో పూర్తిగా కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు, నాయకులు చొరవ చూపితే తాను ఇల్లు నిర్మించుకుంటానని బాధితుడు అప్పారావు కోరుతున్నాడు.



ఎన్‌ఏడీ జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

ఉన్నత విద్యతో కలలు సాకారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షర్మిలరెడ్డి

మల్కాపురం: ఉన్నత విద్యను అభ్యసించి, ప్రతీ మహిళ తన కలలను సాకారం చేసుకోవాలని రాజమండ్రి ప్రాంత అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన నూతన విద్యార్థుల స్వాగత సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు విద్య ఎంతో ముఖ్యమన్నారు. విద్య వలన ధైర్యం, తెలివితేటలు, మాట్లాడే శక్తి, పోరాటపటిమ వస్తాయన్నారు. విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి ఆసక్తి గల రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వ్యర్థాలు

- కొందరి తీరుతో అపరిశుభ్రంగా వీధులు
- చెత్త తరలింపు వ్యాన్లు వస్తున్నా ఎక్కడికక్కడ వ్యర్థాలు
- వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



మల్కాపురం పల్లివీధి సర్వీస్ రోడ్డుపై వ్యర్థాలను తరలిస్తున్న శానిటరీ సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు సర్వీస్ రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త కుప్పలుగా పేరుకుంటోంది. స్థానికులు ఎక్కడికక్కడ వ్యర్థాలను డంప్ చేస్తుండటంతో వీధుల్లో అపరిశుభ్రత నెలకొంటోంది. ఇంటి వద్దకు వస్తున్న శానిటరీ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా.. కొందరు రోడ్లపైనే చెత్త వేయడంతో వీధులు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల పరిధిలో ఒక్కో వార్డుకు 5 నుంచి 6 చెత్త తరలించే వ్యాన్లు కేటాయించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సంబంధిత సచివాలయాల పరిధిలో ఈ వ్యాన్లలో సిబ్బంది తిరుగుతూ వ్యర్థాలను సేకరిస్తున్నారు. అయితే కొందరు ఈ వ్యాన్లు వచ్చినప్పుడు చెత్త ఇవ్వకుండా రాత్రి వేళల్లో ఇంటి దగ్గర్లోని సర్వీస్‌రోడ్లపై వేస్తుండటంతో అవి డంపింగ్‌యార్డుల్లా మారుతున్నాయి. పశువులు, కుక్కలు, పందులు ఆ వ్యర్థాలను చిందరవందర చేయడంతో రోడ్డంతా పరుచుకుంటోంది. దీంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడుతున్నారు. దుర్గంధంతో పరిసర ప్రాంతాల వారు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకుంటే వ్యాధుల ముప్పు పొంచి ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలియజేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ఓటరు జాబితాల పరిశీలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించడంపై ఎన్నికల నమోదు అధికారులు రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి మాట్లాడారు. వివిధ అంశాలపై నాయకులు అడిగిన సందేహాలకు సమాధానమిచ్చారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన ఓటర్లలో తొలగించాల్సిన ఓటర్లను గుర్తించామని పేర్కొన్నారు. వాటి జాబితాలను నాయకులకు అందజేశారు. ఆ జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను తెలపాలని కోరారు. నియోజకవర్గంలోని 305 పోలింగ్ కేంద్రాల్లో నియమితులైన బూత్ లెవల్ ఆఫీసర్ల వివరాలు, వారి ఫోన్ నంబర్లతో కూడిన జాబితాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు ఎం.పాల్ కిరణ్, రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్లు కె.త్రినాథరావు, డి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అద్భుత ఫలితాలు సాధించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

మహారాణిపేట : స్వచ్ఛ సర్వేక్షణ్ –2023లో అద్భుత ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గోడ పత్రికను విడుదల చేశారు. పట్టణాలు, నగరాలు, గ్రామాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నిర్వహిస్తూ, పరిశుభ్రమైన నగరాలను రూపొందించడంలో ఇది కీలకమైందన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరుగుతుందని, 79 పంచాయతీలను లక్ష్యంగా నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం మానుకోవాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ పిలుపునిచ్చారు. దానివల్ల అనేక వ్యాధులు, అంటు రోగాలు వస్తాయన్నారు. మన గ్రామాన్ని, జిల్లాను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చుకుందామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.శ్రీరామమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీపీ శ్రీనివాసరావు, పీఆర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కేవీ శివానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 894వ రోజు మంగళవారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం కలుగుతుందన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటను చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా విధానంలో అమలు చేస్తున్న డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. తోటగరువు, వాడపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న 20 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో ఈ సదస్సు రెండు రోజుల పాటు జరగనుంది. తొలి రోజు సదస్సులో డీఈవో మాట్లాడుతూ ప్రస్తుతం బోధనా విధానంలో మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో బోధించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా డిజిటల్ విధానం, టోఫెల్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఎంఈవో–2 పి.అనురాధ పర్యవేక్షణలో జరిగిన మొదటి రోజు సదస్సుకు 20 పాఠశాలలు నుంచి 45 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, తోటగరువు హైస్కూల్ హెచ్‌ఎం జి.కె.డి.భవాని, కార్యదర్శి వి.విశ్వనాథం, సీఆర్‌పీ టి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఏయూ సైన్స్ కళాశాల పరిధిలో విద్యార్థులకు మత్తు మదార్థాల వినియోగం–పర్యవసానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ఎదగాలన్నారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని, ఉన్నత భవిష్యత్తుకు మార్గంగా ఇది నిలుస్తుందన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ యువత దేశానికి విలువైన సంపదని చెప్పారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.రామారావు మాట్లాడుతూ మత్తుకు బానిస అయితే జీవితం చిత్తవుతుందన్నారు. వివిధ చట్టాలపై, శిక్షలు, పర్యవసానాలను వివరించారు.

మానవ హక్కుల పరిరక్షణకు శాంతి ర్యాలీ



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి జరగాలని ఏయూ విద్యార్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏయూ న్యాయ కళాశాల నుంచి మద్దిలపాలెం గేట్ వరకు ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. హక్కుల ఉల్లంఘనలు జరగకుండా చూడాలని నినదించారు. ఈ కార్యక్రమంలో ఏయూ న్యాయ విభాగం రాజనీతిశాస్త్ర విభాగం, సామాజిక శాస్త్ర విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వేతనాల అమలుకు సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్‌పై మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో కార్మికులను కలిసి, సంతకాలు సేకరించారు. సెయిల్‌లో 2021లో నూతన వేతనాలు అమలు చేశారన్నారు. 2022 ఫిబ్రవరిలో బోర్డు ఆమోదించి, ఆ ఏడాది మే నెలలో ఉక్కు మంత్రిత్వశాఖ ఆమోదం కోసం పంపినా ఇప్పటికీ స్పందన రాకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంతకాలను సేకరించి కేంద్ర ఉక్కుమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు పంపనున్నామని సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి. దాస్ తెలిపారు.

మణిపూర్ మారణకాండపై షిప్‌యార్డ్ కార్మికుల నిరసన



మణిపూర్ ఘటనపై నిరసన తెలుపుతున్న షిప్‌యార్డ్ కార్మికులు

సింధియా: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. షిప్‌యార్డ్ మెయిన్‌గేటు వద్ద మంగళవారం ఉదయం చేపట్టిన నిరసన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అప్పలకొండ మాట్లాడారు. మణిపూర్‌లోని ఆదివాసీలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు ప్రభుత్వ పాలనా తీరుకు నిదర్శనమన్నారు. ఆ సంఘటనలు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని, ఘటనలకు బాధ్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, కొండలరావు, పవన్‌కుమార్, వెంకటఅప్పారావు, పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

22వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారానికి 22వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న అప్పలరాజు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచమని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాసుపల్లి ఎల్లాజీ, కొవిరి అమ్మోరు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.